www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 మార్చి 2025
5
చిత్తూరు

బడ్జెట్ అంచనాలు రూ.277 కోట్లు ఆమోదం

నగరపాలక సంస్థ బడ్జెట్ను ప్రవేశపెడుతున్న మేయర్ అముద

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగరపాలక సంస్థ 2025-26 సంవత్సర బడ్జెట్ రూ.2,77,0602,401లు అంచనాలను ఆమోదించినట్లు మేయర్ ఎస్.అముద తెలిపారు. గురువారం నగరపాలక సమావేశం మందిరంలో మేయర్ అధ్యక్షతన చిత్తూరు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ముందు ఉంచారు. సమగ్ర చర్చ అనంతరం బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం: మేయర్

చిత్తూరు నగరపాలక సంస్థను సభ్యులంతా కలిసికట్టుగా అధికారులను సమన్వయం చేసుకొని అభివృద్ధి చేసుకోవాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం మధ్యాహ్నం నగరపాలక సమావేశం మందిరంలో మేయర్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్లు, కోఆప్షన్స్ సభ్యులు పాల్గొన్నారు. అత్యవసర సమావేశంలో భాగంగా పలు అజెండా అంశాలపై చర్చించారు. నగరంలోని కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండ్ను పీపీపీ మోడ్లో అభివృద్ధి చేయుటకు.. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అత్యాధునిక బస్టాండ్ సహా బహుళ వినియోగ వాణిజ్య సమయాన్ని నిర్మించుటకు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ ఇచ్చిన లేఖ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆదేశాలు పొందుటకు ఆమోదించారు. నగరపాలక సంస్థ పరిధిలో కూరగాయల మార్కెట్, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందం బస్టాండ్, 2025-26 సంవత్సరానికి బహిరంగ వేలంలో హెచ్చు పాటదారులకు కేటాయించడానికి, నగరపాలక సంస్థ సంబంధించి ఏఎస్ఎం, ఎమ్మెస్సార్ కాంప్లెక్స్, గిరింపేట మీసేవ బిల్డింగ్ పక్కనున్న గదులను హెచ్చు పాటదారులకు కేటాయింపు కోసం, టేబుల్ అజెండా ద్వారా నగరపాలక సంస్థ పరిధిలోని రెడ్డిగుంట బాలాజీ హేచరీస్ ఎదురుగా ఉన్న ప్రాంతాన్ని సుందర్ నగర్గా, కొత్త కలెక్టరేట్ వెనక ప్రాంతాన్ని సుజీవ నగర్గా పేరు పెట్టడానికి సభ ఆమోదించింది. మరికొన్ని అజెండా, టేబుల్ అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. సమావేశంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ చర్చల్లో పాల్గొన్న కార్పొరేటర్లు

ఎండిన చెరువులు.. బీడుగా భూములు

- నిండుకున్న భూగర్భ జలాలు
- వలసబాట పట్టిన కూలీలు
- దిక్కుతోచని పరిస్థితిలో రైతులు

ప్రజాశక్తి- గంగవరం

జిల్లాలో మండుతున్న ఎండలతో చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. బోర్లు, వ్యవసాయ బావుల్లో నీటిమట్టం పడిపోయింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో మార్చి నెలకి మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి కనీసం మూగజీవాలు పక్షులు తాగడానికి చుక్కనీరు కూడా ఎక్కడ కనబడటం లేదు. మండలంలో మూడు పెద్ద చెరువులు, 60 చిన్న చెరువులు, 130 కుంటలు ఉన్నాయి. అంతేకాకుండా మండల పరిధిలో కౌండిన్య నది కూడా ఉంది. ఇన్ని ఉన్నా ఎక్కడ కానీ చుక్కనీరు కనపడే దాఖలాలు లేవు. ఈ పరిస్థితులలో కూలీలకు పనులు లేక సమీపంలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి ఉదయం 6 గంటలకు ఆటోలలో వెళ్లి కూలి పనులు చేసుకుని తిరుగు ముఖం పట్టాల్సిన దుస్థితి నెలకొంది.

ఇటీవల కాలంలో కౌండిన్య నదిలో ఇసుకాసురులు సుమారు 20 నుండి 45 అడుగుల దాకా ఇసుకతో పాటు మట్టి కూడా తోడి తరలించడంతో నది పూర్తిగా ఎండిపోయింది. దీనితో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో కౌండిన్య నది పరిసర ప్రాంతాలలో కేవలం 30 అడుగులలో నీరు పుష్కలంగా ఉండి వ్యవసాయ బోర్ల ద్వారా రైతుల పంటలు చేసుకొని సంతోషంగా ఉండేవారు. ప్రస్తుతం ఆ బోర్లు నీరు నిలిచిపోవడంతో రైతులు సైతం వ్యవసాయానికి దూరమవుతున్నారు. ఈ పరిస్థితులలో పంట పొలాల్లో ఉండవలసిన రైతులు గ్రామాలలోని చెట్ల కింద పనులు లేక రోజులు గడపాల్సిన దుస్థితి నెలకొంది. రైతులకు వ్యవసాయం లేక పంటలు చేయకపోవడంతో దినసరి కూలీలుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ బోరు కొత్తగా వేయాలంటే కనీసం రూ. లక్ష నుంచి 2 లక్షలు ఖర్చు పెట్టాల్సిందే. ఒకవేళ బోరు వేసి నీరు పుష్కలంగా పడిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు సకాలంలో అందుబాటులో ఉండవని రైతులు వాపోతున్నారు.

నదిలో ఇసుకతోపాటు మట్టిని తోడేస్తున్న ఇసుకాసురులు, చుక్కనీరు కూడా లేకుండా పూర్తిగా ఎండిపోయిన చెరువు

పనుల కోసం వలసపోతున్న కూలీలు

నీరు లేక భూములు బీడుగా మారాయి..

- వెంకట రమణారెడ్డి, రైతు, గంగవరం

నాకు కౌండిన్య నది పక్కన ఎకరా పొలం ఉంది. నదిలో నీరు పుష్కలంగా ఉన్నప్పుడు మోటరు ద్వారా నీటిని పంటకు పెట్టుకునేవాళ్లం. కూరగాయలు, వరి వంటి పంటలు సాగు చేసుకుని జీవించేవాళ్లం. ప్రస్తుతం నీరు లేక నది ఎండిపోయింది. బోర్లులో సైతం నీరు రావడం లేదు. దీంతో వ్యవసాయ భూములన్నీ బీడుగా మారాయి. ఇక వర్షాలు వచ్చే వరకు మేం వ్యవసాయంకు దూరంగా ఉండాల్సిందే. జీవనం గడవటానికి కూలిపనులకు పోవాలి. ప్రభుత్వం వేసవి ఎద్దడి నేపథ్యంలో రైతులను ఆదుకోవాలి.

పనుల కోసం పక్క రాష్ట్రంకి వెళ్లాలి

- రత్నమ్మ, దినసరి కూలీ, గంగవరం

గతంలో స్వగ్రామంలోనే రోజు వ్యవసాయ పనులు దొరికేవి. ప్రస్తుతం ఇక్కడ సాగునీరు లేక వ్యవసాయం జరగడం లేదు. ఉపాధి పనులు సైతం అంతంతమాత్రమే. దీంతో పొట్టకూటికోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకకు ఉదయం ఆరు గంటలకు ఆటోలో వెళ్లి సాయంత్రం ఆరు గంటలకు గ్రామానికి తిరిగి వస్తున్నాం. సొంత స్థలంలో పనులు లేక నాతోపాటు చాలా మంది దూరప్రాంత్రాలకు కూలీలుగా వస్తున్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి: నారా భువనేశ్వరి



మహిళలకు రుణాల చెక్కులు అందిస్తున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: మహిళల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తున్నదని, స్వయం సహాయక సంఘ మహిళలకు బ్యాంకు రుణాలను అందించి వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అన్ని విధాలా సహకారం అందిస్తున్నదని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. గురువారం కుప్పంలో డిఆర్డిఏ, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలకు సేవలను అందించడంలో భాగంగా ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మైక్రోసెట్ శాఖను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ మహిళా శక్తి ప్రాధాన్యతను వివరించారు. మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని మంచి వ్యాపారవేత్తలుగా ఎదిగి వారి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి మహిళ పొదుపును పెంచుకోవటానికి బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎఫ్జిఎం రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ మైక్రో సెట్ శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలకు, సంఘ సభ్యులకు ముద్రా రుణాలు, లఖ్పతి దీదీ రుణాలు, బంగారు నగలపై రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా 160 సంఘాలకు గానూ రూ.30కోట్లు, ఇండియన్ బ్యాంక్ తిరుపతి జోన్ ద్వారా రూ.330.కోట్లు భువనమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. డిజిఎం, ఇండియన్ బ్యాంకు, జోనల్ మేనేజర్, తిరుపతి సెల్వరాజ్, డిజెడ్ఎం, ఇండియన్ బ్యాంకు, జోనల్ ఆఫీస్, తిరుపతి, బాలచంద్ర మోహన్, ఎల్డిఎం హరీష్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి రాంప్రసాద్ రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఇన్ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ 28వ తేదీ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలే భవనంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిష్టాపన, అదనపు వసతి గదుల ప్రారంభోత్సవం 10 గంటలకు నిర్వహించబడును. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ కులసంఘాల నాయకులు, జిల్లా అధికారులు,అనధికారులు ప్రజలందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు

అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో తెలుగుతనం ఉట్టిపడేలా ఈనెల 30న విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలో డిఆర్ఓ ఛాంబర్లో ఈ నెల 30న నిర్వహించనున్న ఉగాది పండుగ వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై రెవెన్యూ, ఇండోన్మెంట్స్, టూరిజం శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వావసు నామ ఉగాది వేడుకలను జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసిందని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లను చిత్తూరు ఆర్డిఓ, తహశీల్దార్లు ఇండోన్మెంట్స్, టూరిజంశాఖలు సమన్వయంతో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో భాగంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలుగు భాషకు ఉత్తమ సేవలందించిన వారికి నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాడి పరిశ్రమ అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, పులివర్తి నాని అన్నారు. గురువారం మండలంలోని సంక్రాంతిపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో సర్పంచ్ రమేష్ ఆధారంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకి పాడి పరిశ్రమ ఎంతో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని మేలు జాతి పశు సంతతి ఉత్పత్తి చేసుకొని పాడి పరిశ్రమ అభివృద్ధి చేసే విధంగా చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పశువులకు వచ్చే వ్యాధులకు వైద్యులు చికిత్సలు అందించారు. అనంతరం ఉత్తమంగా గెలుపొందిన లేగ దూడలకు బహుమతులు ప్రదానం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, జెడి డాక్టర్ ఆరిఫ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆసిఫ్, డాక్టర్లు విజయ మోహన్, ఝూన్సీ, సుబ్బారావు పాల్గొన్నారు.

రామకుప్పం ఎంపిపి టిడిపి కైవసం..!

- ఎంపిపిగా సులోచన
- వైస్ ఎంపీపిగా వెంకట్రామ గౌడు
- ఉత్కంఠ మధ్య ఏకగ్రీవంగా ఎన్నికలు

ప్రజాశక్తి - రామకుప్పం

ఎంపిపి, వైస్ ఎంపీపీలను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

రామకుప్పం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవమవ్వగా.. కుప్పం నియోజకవర్గంలో ఒక ఎంపిపి స్థానాన్ని టీడిపి కైవసం చేసుకుంది. రామకుప్పం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికలను ప్రారంభించామన్నారు. ఎంపీటీసీ సభ్యులు ఏడు మంది ఎన్నికలకు హాజరయ్యారన్నారు. మొదట మండలంలోని ఉన్సిగానిపల్లి చెందిన సులోచనను ఎంపిపిగా వెంకట్రామ గౌడు బలపరిచారు. ఉపాధ్యక్షులుగా విజలాపురంకు చెందిన వెంకట్రామ గౌడును ఎంపీటీసీలు ఆరు మంది సభ్యులందరూ ఎన్నుకున్నారు. ఈ క్రమంలో 11 గంటల తర్వాత ఎన్నికల ప్రారంభించి అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నిక అనంతరం ధ్రువీకరణ పత్రాలను సభ్యులకు అందజేశామన్నారు. 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వైసిపికి చెందిన ఎనిమిది మంది మాత్రం ఆలస్యంగా మండల కార్యాలయం వద్దకు చేరుకోగా... అప్పటికే ఎన్నికల సమయం ముగిసిందని ప్రకటించడంతో ఎంపిటిసి సభ్యులు వెనుతిరిగారు. అనంతరం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి, కూటమి నాయకులు, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గత స్థానిక ఎన్నికలలో మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. దీంతో మనేంద్రం ఎంపీటీసీ శాంతకుమారి ఎంపీపీగా ఎన్నుకున్నారు. 2021లో అనారోగ్యంతో ఆమె మరణించారు. అప్పటి నుండి రామకుప్పం-2 సెగ్మెంట్ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మొదటి వైస్ఎంపిపిగా, ఇన్చార్జి ఎంపీపీగా ఉన్నారు. ఐదుసార్లు ఎంపిపి ఎన్నికకు అధికారులు చర్యలు చేపట్టిన ఎంపీటీసీలు హాజరు కాలేదు. ఆయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలోని 15 మంది ఎంపీటీసీలలో 7మంది కూటమికి మద్దతు పలికారు. ఈ అనూహ్య పరిణామాల మధ్య గురువారం ఎంపిపి స్థానాన్ని టీడిపి కైవసం చేసుకుంది. కార్యక్రమంలో డిఎస్పి పార్థసారథి, సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు వెంకట మోహన్, నరేష్, తహశీల్దార్ కాలేష్, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి ఎన్ని కుట్రలు చేసిన ఎంపిపి పదవి కైవసం చేసుకున్నాం.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం మండల ప్రజాపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను వైసిపి ఎన్ని కుట్రలు చేసినా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం మీడియాతో మాట్లాడుతూ... గతంలో కోరం లేని కారణంగా పలుమార్లు ఎంపిపి ఎన్నికలు వాయిదా పడిందన్నారు. దీంతో ప్రస్తుతం కోరం లేకపోయినప్పటికీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ పేర్కొనడం జరిగిందన్నారు. కాగా టీడీపీ ఎంపీటీసీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు ఎన్నికలకు హాజరు కాకూడదని భయభ్రాంతులకు గురిచేయడం సబబు కాదన్నారు. రాష్ట్ర నేతలు సురేష్ బాబు, మునస్వామి, నారాయణచారి, సీఎం పీఏ మనోహర్, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఎస్హెచ్జి సభ్యుల జీవనోపాధి పెరగాలి

డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి

కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు (యాద మరి): మారుతున్న కాలానికి అనుగుణంగా స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి పెరగాల్సిన అవసరం ఉందని, ఇందుకు గ్రామస్థాయి నుంచి ప్రణాళికలను సిద్ధం చేయాలని చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి తెలిపారు. గురువారం చిత్తూరులోని డిఆర్డిఏ సమావేశ మందిరంలో 2025-26 సంవత్సర స్వయం సహాయక సంఘాల వార్షిక అప్పులు జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ఏపీఎంలు సీసీలకు జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పులు, జీవనోపాధికి సంబంధించి క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికలను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఇందుకుగాను ప్రతి ఐదు సంఘాల నుంచి చదువుకుని సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండి , సంఘాల కార్యక్రమాలపై పరిజ్ఞానం కలిగిన 30 సంవత్సరాల వయస్సు ఉన్న ఒక సభ్యురాలను ఎంపిక చేసుకోవాల్సిందన్నారు. వీరి ద్వారా ఈ ప్రణాళికలను తయారు చేయించాలని, వీరిని ఎంపిక చేయడంలో ఏపీఎంలు సీసీలు బాధ్యత తీసుకోవాలన్నారు. స్వయం సహాయ సంఘ సభ్యులకు ఇచ్చే రుణాలు విషయంలో కూడా క్షేత్రస్థాయిలో సిబ్బంది కొంత ముందుచూపు చూపాలన్నారు. తక్కువ సమయంలో జీవనోపాధి పెరిగే విధంగా ఉండే యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేవలం ఆవులు గొర్రెలు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించి ఆ దిశగా రుణాలను అందించాలన్నారు. గతంలో లక్ష్యాలను పై స్థాయి నుంచి నిర్దేశించే వారిని అయితే ఈసారి సెర్ప్ సీఈఓ ముందుచూపుతో ఈ టార్గెట్లు సంఘాల నుంచి రావాలని నిర్దేశించారన్నారు. డిపిఎంలు రవికుమార్, సుబ్బారెడ్డి, మధు పాల్గొన్నారు.

ఇన్ని పనులు చేయలేం..!

- పంచాయతీ కార్యదర్శులకు 33 యాప్ల పనిభారం
- చిన్న తప్పిదం జరిగినా మెమోలు
- నిరసనలకు సిద్ధమవుతున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

పంచాయతీ కార్యదర్శులు పనిఒత్తిడితో సతమతమవుతున్నారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలకు సంబంధించి పనుల్లో వారి ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామ సచివాలయ సిబ్బందిపై సర్వేల పేరుతో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఒక సర్వే చేస్తుండగానే మరో సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసి వాటికి కాలపరిమితి విధించడంతో ఊపిరి సలపని పరిస్థితుల్లో సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు మౌనంగా రోధిస్తున్నారు. సచివాలయ సిబ్బంది వారి రోజువారి విధులు నిర్వహిస్తూ సర్వేలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. సాధ్యాసాధ్యాలు పక్కనబెట్టి టార్గెట్లు ఇచ్చి వేధింపులు గురి చేస్తున్నారు.

యాప్ల పేరుతో పని భారం

గ్రామసచివాలయంలోని పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం 33 యాప్ల్లో సమాచారం పొందుపరచవలసి ఉంది. గ్రామ సచివాలయాలు ద్వారా సిబ్బంది పెరిగినా పంచాయతీ కార్యదర్శులకు మాత్రం పనిభారం తగ్గలేదు. వేలపాల లేకుండా యాఫ్లలో సమాచారం అప్లోడ్ చేయడం. ఉన్నతాధికారులకు వివరణలు వంటి వాటితో అదనపు భారం పడుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫోటోల అప్లోడ్ తోనే ప్రాణం పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1. రెవెన్యూకు సంబంధించినవి సర్వేలో సమస్యలపై పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం సంబంధించి కూడా పంచాయతీ కార్యదర్శులు లాగిన్ను అప్డేట్ చేయాల్సి ఉంది. రెవెన్యూలో ప్రజా సమస్యల లాగిన్ కూడా ఇవ్వడంతో చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2. వర్క్ ఫ్రంహోం యాప్ ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది సంబంధించిన వివరాలు పొందుపరచాల్సి ఉంది. వారి వద్ద బయోమెట్రిక్ తీసుకోవాలి లేదంటే ఓటీపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఎక్కువ సమయం తీసుకుంటుంది. పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే.

3. అప్డేట్, ఈ కేవైసీ ఇంట్లో ఎంతమంది ఉన్న అంత మంది బయోమెట్రిక్ వేయించుకోవాలి. చిన్న పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ ఉండదు. ఇంట్లో కొంతమంది అందుబాటులో ఉండరు వారి వద్ద ఒకటి నుంచి రెండు మూడు సార్లు తిరగాల్సి ఉంటుంది.

4. హౌస్ హోల్డ్ సర్వే పంచాయతీలోని ప్రతి ఇల్లు జియో టాకింగ్ చేయాలి వీటన్నిటికీ పంచాయతీ కార్యదర్శి బాధ్యులు. ఉన్న 33 యాప్ల్లో ప్రధానంగా ఉన్న యాప్ల వివరాలు ఇవి కొన్ని మాత్రమే..

నిరసనలకు కార్యాచరణ...

పని ఒత్తిడి, అధికారుల బెదిరింపులు, మెమోలు, సోకాజ్ నోటీసులతో విసిగిపోయిన పంచాయితీ కార్యదర్శులు చివరకు ఆందోళన బాట పడుతున్నారు. అందులో ముందస్తు భాగంగానే అన్ని మండల అభివృద్ధి అధికారులకు పంచాయతీ కార్యదర్శులు మూకుమ్మడిగా యాపుల భారం నుండి మమ్మల్ని తప్పించండని సమస్యలతో కూడిన వినతి పత్రాలతో అధికారులకు తెలియజేస్తున్నారు. వినతిపత్రాలు అధికారులకు ఇస్తున్న గాని పైస్థాయి అధికారులు వారి గోడు ఇదే నాధుడే కరువయ్యారు. ఈ క్రమంలో నిరసనలకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో అన్ని అభివృద్ధి అధికారులకు వినతిపత్రాలతో నిరసన తెలుపుతున్నారు. ఈ యాప్ల భారం ఇలాగే కొనసాగితే పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర యూనియన్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తుందని ఆ దిశగా తమ పోరాటాలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి సంఘం నాయకులు చెబుతున్నారు.



వినతిపత్రాలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్ ఫొటో)

సర్వేలను నుంచి మినహాయించాలి..

- ఎం. ప్రకాష్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలం అధ్యక్షులు

గ్రామపంచాయతీల్లోని ప్రాథమిక విధులైన తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, ఎస్డబ్ల్యూపిసి నిర్వహణ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నాం. సమయం అంతా సర్వేలు చేయటంలో, ఉన్నతాధికారులు అడిగిన సమాచారం అందించడానికి సరిపోతుంది. పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం అమలు చేస్తున్న సర్వేల నుండి మినహాయింపు ఇవ్వాలి. గ్రామపంచాయతీ అభివృద్ధి చేసేందుకు జిపిడిపి సంబంధించిన ప్లాన్ ప్రస్తుతం చేయాల్సి ఉంది. అవి చేయడానికి గాని సమయం లేదు. పలు రకాల సర్వేలను పంచాయతీ కార్యదర్శుల నుండి మినహాయిస్తే పంచాయతీ అభివృద్ధి పై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు వీలుంటుంది.

సచివాలయం పరిధిలో సర్వే చేయాల్సిన యాప్ల వివరాలు

1. మిస్సింగ్ సిటిజన్స్ సర్వే
2. మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే
3. వర్క్ ఫ్రమ్ హోం
4. హౌస్ హోల్డ్స్ జియో టాకింగ్
5. పి4 సర్వే
6. డెత్ రి వెరిఫికేషన్ సర్వే
7. పిఎసిఎస్ సర్వే
8. లెదర్ ఆర్టిజన్స్ సర్వే
9. ఎన్పిసిఎల్ లింకింగ్ సర్వే
10. 0-6 సంవత్సరాల పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే
11. నాన్ ఏపీ రెసిడెంట్స్ సర్వే
12. విలేజ్ అసెట్స్
13. విలేజ్ ప్రొఫైల్ సర్వే
14. ఇంటిపన్నుల వసూళ్లు
15. కుళాయి పన్నుల వసూళ్లు
16. లైసెన్స్ వసూళ్లు
17. లీజ్ వసూళ్లు
18. వేలం పాటలు
19. ఇతర పన్నేతర వసూళ్లు
20. పిఆర్ వన్ యాప్
21. శానిటేషన్ డ్రైవ్
22. ఎస్డబ్ల్యూపిసి షెడ్
23. క్లాప్ మిత్ర పని చేయించడం
24. వర్మీ తయారీ
25. ప్రతి గురువారం సేల్స్
26. వాటర్ ట్యాంక్ క్లీనింగ్
27. క్లోరినేషన్
28. ఐవిఆర్ఎస్ యాప్
29. ప్రతి మూడవ శనివారం స్వర్ణంద్ర-స్వచ్ఛంద్ర కార్యక్రమాలు
30. ప్రతికూల వార్తలకు ప్రతిస్పందన
31. స్వర్ణ పంచాయతీ చలనా ఎంట్రీ
32. పిఆర్ఇజిపిడిపి
33. గ్రామపంచాయతీలో నీటి సమస్య
34. జనరల్ అడ్మినిస్ట్రేషన్ (గ్రామ పంచాయతీ, గ్రామసభ మీటింగ్స్ జరుపుట, గ్రామ పంచాయతీ రికార్డుల అప్డేషన్, వివిధ సర్టిఫికెట్స్ జారీ, సిబ్బంది జీతాలు, ఆర్టిఐలు, పిజిఆర్ఎస్ లు), రివ్యూ మీటింగ్స్, ఆడిట్, ప్రొఫార్మాలు, గూగుల్ మీట్ మౌక్ అనౌన్స్మెంట్స్, బ్యానర్స్, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, సచివాలయ సిబ్బందితో సమన్వయం, అధికారుల విజిట్లు, పాలకవర్గం, రాజకీయ నాయకులతో సమన్వయం, ఇవి కాక ప్రతి పంచాయతీ లోనూ ఎన్నో చిన్నా, పెద్ద సమస్యలు ఇంతింతై పనిభారం ఇంతై తట్టుకోలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

హోషికియా కారు షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఇరువారం రహదారిలో నూతన హోషికియా కారు షోరూంను మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాధ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాధరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ కియాలోని అన్ని కార్ల సేల్స్, సర్వీస్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా విడుదలైన కియా సిరోస్ కారును నూతన షోరూంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కారు ప్రారంభ ధర రూ.8.99 లక్షల నుండి ఉందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ఇంజన్ ఆప్షన్స్, మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లలో, 8 రంగులలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో నూతన కస్టమర్లు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు. కియా కార్ల బుకింగ్ కొరకు సెల్ 9281403695 నెంబరును సంప్రదించాలని కోరారు.

వైస్ ఎంపీపీ 2గా మునెమ్మ ఏకగ్రీవం

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండవ ఉపాధ్యక్షురాలుగా కోశాలనగరం ఎంపిటీసీ మునెమ్మ పలువురు ఎంపిటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్, ఎంపీడీవో రాజేంద్రన్, ఆర్వో ఆధ్వర్యంలో ఎంపీపీతో పాటు పలువురు ఎంపిటీసీలు మద్దతిచ్చి మండల ఉపాధ్యక్షురాలుగా మునెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుమార్స్వామి రెడ్డి సమీక్షంలో ఆమెకు శాలువ, పూలమాలతో సన్మానించారు. అనంతరం ఎంపీపీ మంజుల, ఉప ఎంపీపీ మంజు బాలాజీ, వైసీపీ మండల అధ్యక్షులు శివరాజు, నాయకులు గుణశేఖర్ రెడ్డి, గోవర్ధరెడ్డి, చెంచు ప్రసాద్, రాజగోపాల్, ప్రతాప్, రమేష్ ఉప ఎంపీపీని శాలువాలతో సన్మానించి అభినందించారు.

ఎంపిపిగా ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి

ప్రజాశక్తి తవణంపల్లి: ఎంపీపీగా ప్రతాప్ సుందర్ రాయల్రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వైసిపి ఎంపీటీసీ అభ్యర్థులు 14 మంది ఎంపిపిగా ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీవో ఆఫీసులో రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సమక్షంలో తవణంపల్లి మండల ఎంపీపీగా ఎన్నికైన ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేశారు . అనంతరం వైఎస్ఆర్ సీపీ పూతలపట్టు ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపి దృశ్యాలతో సత్కరించారు. డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ తవణంపల్లి మండలాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లాలని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల కన్వీనర్ సిపి హరిరెడ్డి, మాజీ ఎంపీపీ గీత హరికృష్ణ రెడ్డి, శోభ బాబురెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, మధు కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్యనేతలు ఎమ్మెల్యే అమర్నాథ్రెడ్డి ఇంటి వద్ద గురువారం సందడి చేశారు. ఇటీవల పుంగనూరులో జరిగిన ఘటనకు సంబంధించి బాధితులను వెళ్ళి పరామర్శించాలని పార్టీ ఆదేశించిందని దీంతో చంద్రగిరి, శ్రీకాళహస్తి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, గురుజాల జగన్ మోహన్, మురళీ మోహన్లు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి స్వగృహానికి చేరుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం కనిపించింది. వీరి వెంట జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్, జయప్రకాశ్ నాయుడు, పలమనేరు కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ ఉన్నారు.

ప్రతి సమస్యా పరిష్కరిస్తాం: తహశీల్దార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రెవెన్యూ సదస్సులో ప్రజలు అందించిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా రెవెన్యూ సదస్సుకు ఇచ్చిన అర్జీదారులతో మాట్లాడారు. సదస్సులో తెలియజేసిన సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే అధికారులు ఏవరైనా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని వివరాలు తెలుసుకున్నారు. మండలం మొత్తంగా 271 అర్జీలు రావడంతో ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు.

విద్యాప్రమాణాలు పాటించాలి: సిడిపిఓ

ప్రజాశక్తి- యాదమరి: అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించాలని సిడిపిఓ వాణిశ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని కాశీరాళ్ల, మాదిరెడ్డిపల్లి సెక్టర్ల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. గురువారం శిక్షణా కార్యక్రమానికి బంగారుపాళ్యం సెక్టార్ సిడిపిఓ హాజరయ్యారు. సూపర్వైజర్స్, లలితమ్మ, సరళ కుమారి, కవిత, అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షకీలా పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** క్షేత్రస్థాయిలో విద్యను బలోపేతం చేయాలని సిడిపిఓ వాణిశ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులు శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో విద్య నేర్చుకున్న వారు అభివృద్ధికి చెందాలన్నదే పోషణ బి పడాయి బి ఉద్దేశమన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన అంగన్వాడీ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. సూపర్వైజర్లు రెడ్డికళ్యాణి, జయశ్రీ పాల్గొన్నారు.

వేలంలో రూ.5.37లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు గ్రామ సచివాలయంలో గురువారం పంచాయతీ అధికారులు వార్షిక బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ పార్వతి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ అధికారులు పాల్గొని గ్రామస్తుల సమక్షంలో రూ.5.10లక్షలకు వైస్ ఎంపీపీ హరిబాబుకు వారపు సంతను వేలంలో ఖరారు చేశారు. 1 రూముకు గాను 27 వేలు ఖరారు కాగా, పంచాయతీకి రూ. 5.37లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

వైసీపీ అధ్యక్షులుగా బాలాజీ నాయుడు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ వైసీపీ అధ్యక్షులుగా మండిపేట కోటూరు చెందిన బాలాజీ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో వైసిపి కార్యకర్తలు నాయకులు గురువారం వైసీపీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. బాలాజీ నాయుడు మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉన్నదని, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, వెంకటే గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు సంగారెడ్డి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ఆవలకొండ గ్రామంలో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, ఫయాజ్ వారి మిత్రబృందం గురువారం ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేశారు. చిన్నారెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మా ఫౌండేషన్ ఫౌండర్ వినోద్, శివగురు ఇన్ఫ్రా డైరెక్టర్ ప్రసాద్, ఇఫతేఖర్, అహ్మద్, బాబు, రిజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయతీ బాలుపల్లి గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో ఎంపీపీ బండి నాగహేమ సుందర్ రెడ్డి, ఎంపీటీసీ హరి విజయ శేఖర్రెడ్డి సహకారంతో సర్పంచ్ భారతి రాముల ఆధ్వర్యంలో గురువారం బోరు వేసి ప్రజలకు తాగినీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్లు వైసిపి నేత శివారెడ్డి చెప్పారు. నాయకులు జనసేన హేమాద్రి, టిడిపి శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆశాలకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ చేపట్టినట్టు తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు తెలిపారు. గురువారం డాక్టర్ లోహిత్ మాట్లాడుతూ మండలంలోని 80 మంది ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాంను పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. ఆశాలు విధులకు హాజరయ్యేటప్పుడు ప్రభుత్వం అందించిన యూనిఫాంలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈవో రమేష్ బాబు, ఆరోగ్య సూపర్వైజర్ హరికృష్ణ, సిహెచ్ఓ పునీత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నంజంపేట పంచాయతీ సరస్వతీపురం గ్రామంలోని బస్షెల్టర్లో వైస్ సర్పంచ్ ముబారక్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవి ఎండలు మండుతున్న తరుణంలో పాదాచారులకు వాహన చోదకులకు తాగునీరు అందించేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామని తాగునీటితోపాటు చల్లని మజ్జిగ కూడా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు వాహన చోదకులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని తమ దాహార్తిని తీర్చుకోవచ్చని తెలిపారు. చంద్రశేఖర్, గంగాధరం, అబ్దుల్ సలాం, బాలకృష్ణ నాయుడు, నాగరాజ పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్గా భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి- గంగవరం: మండలం వైఎస్సార్సీపీ కన్వీనర్గా మామిడి పంచాయతీ సర్పంచ్ భాస్కర్ రెడ్డిని ఎంపిక చేసినట్లు తెలియజేశారు. స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి భాస్కర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్రెడ్డి మాట్లాడుతూ పార్టీ తమపై ఎంతో నమ్మకంతో ఎంపిక చేసినందుకు పార్టీని బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

అరుదైన చికిత్స విజయవంతం



ప్రెస్మీట్లో మాట్లాడుతున్న పిఈఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పిఈఎస్ ఆసుపత్రిలో నిర్వహించిన అరుదైన చికిత్స విజయవంతంగా ముగిసినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంకె.సుబ్రమణ్య గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్ఆర్పురం మండలం, జంగాలపల్లి గ్రామానికి చెందిన రోషిని, మక్బుల్ దంపతులు డెలివరీ కొరకు జనవరి 18వ తేదీన తమ ఆసుపత్రిని ఆశ్రయించినట్లు తెలిపారు. రోగిని పరీక్షించిన డాక్టర్లు శిశువు బరువు తక్కువగా ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. అయితే తల్లికి పురిటినొప్పులు రావడంతో ముందస్తు ప్రసవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జన్మించిన మగ శిశువు కేవలం 740 గ్రాములు బరువుతో అనేక రుగ్మతలు కలిగి ఉన్నట్టు గుర్తించామన్నారు. వెంటనే శిశువును ఎన్ఐసియుకి తరలించి రెండు మాసాల పాటు అత్యుత్తమ వైద్యసేవలను నర్సింగ్ సంరక్షణతో అందించడంతో పాటు శిశువు ఆరోగ్య పరిస్థితిని, తల్లిదండ్రులకు నిరంతరం వివరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం శిశువు బరువు 1.5 కేజీలకు చేరిందని, ఈ వైద్య సేవలన్నియు పిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర నాయుడు, ప్రొఫెసర్ డాక్టర్ హరిచంద్ర, ఎన్ఐసియు ఇంచార్జి డాక్టర్ దీప్తి, వైద్య బృందం ఆధ్వర్యంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య మార్గదర్శకంలో అందించినట్లు తెలిపారు. కాపాడిన వైద్య బృందాన్ని పిఈఎస్ యాజమాన్యం అభినందించింది.

దోమకాటు వ్యాధులపై అవగాహన కల్పించండి

మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లాలోని ఆరోగ్య కార్యకర్తలకు గురువారం ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడు వాపు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై, ఫ్రైడే డ్రైడే నిర్వహణపై, స్ప్రేయింగ్ కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అప్పుడప్పుడు కొత్త యాప్స్ వస్తునందున రోజువారి చేసే కార్యక్రమాలలో సేవలు అందించిన తర్వాత యాప్స్లో ఎలా నందు నమోదు చేయాలి, రికార్డ్స్ అప్డేటెడ్గా ఎలా నమోదు చేయాలో తెలుసుకోవాలన్నారు. మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నెలలో 20రోజులు ఫిక్స్డ్టూర్ ప్రకారం సేవలు అందించాలన్నారు. ఎంటమాలజిస్ట్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా అనుమానిత జ్వరం కేసులను రక్త నమూనాలు కలెక్ట్ చేసి లాబ్లో ఇవ్వాలన్నారు. ఎఫ్బిడి చార్ట్ వేయుట, ఎంఎఫ్ 2 బుక్స్ మైంటైన్ చేయడంపై వివరించారు. ఐడిఎస్పి డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ అనుమానిత కేసులను ఐహెచ్ఐపి పోర్టల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం ఓ.డాక్టర్ ప్రవీణ, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ పాలనలో ప్రజలందరికీ మంచే..

2వ రోజు కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. 2వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

అందరికీ సంక్షేమం

ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు కానీ చంద్రబాబు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారని, ప్రజలు కాస్త ఓపిక పట్టాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదన్నారు. 2019 తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేదన్నారు. పోలవరం పూర్తయ్యేదని, రాష్ట్రమంతటా అభివృద్ధి జరిగి ఉండేది అన్నారు. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు, పారిశ్రామివేత్తలకు తెలుసని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపినట్టు తెలిపారు. డ్వాక్రా మహిళలతో మాట్లాడుతూ ముందుగా మహిళలందరికీ ఉగాది, రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించడం జరిగిందన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడొద్దు..

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి, ఎండ వేడిమి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు పరిధిలో వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించాలనీ చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఉమ్మడి చిత్తూరు జిల్లా యంత్రాంగానికి ఓ ప్రకటనలో సూచించారు. మౌలిక సదుపాయాల కల్పన విషయంలో అధికారులెవరూ రాజీ పడొద్దంటూ తెలియజేశారు. వేసవి నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తాను ఢిల్లీలో ఉన్నా ఏడు నియోజకవర్గాల శాసనసభ్యులతో టచ్లో ఉంటూ.. నియోజకవర్గాల అభ్యున్నతికి తన వంతు సహకారాన్ని అందించేందుకు వెనుకాడలేదని అన్నారు. ఎమ్మెల్యేలు, అధికారుల సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

సూరీడుతో జర జాగ్రత్త...

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండ, వడగాల్పులతో ప్రజల అవస్థలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండతీవ్రతకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో మార్చి నెల నుంచే సూరీడు ప్రతాపం మొదలుపెట్టాడు. కొన్ని మండలాల్లో మార్చి చివరికి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది అంటే రానున్న వేసవి తీవ్రత ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ రైతులు, పశువుల కాపరులు, కూలీలు, చిరువ్యాపారులు ఎండల నేపథ్యంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని వడదెబ్బ భారిన పడకుండా ఎక్కువగా నీరు తాగడంతోపాటు మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటివి తరచూ తీసుకుంటూ ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాంకుడా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండల్లో తిరగకుండా ఇంటిపట్టున ఉంటూ క్రీడలు, విద్యలో నైపుణ్యం పెంచుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

తప్పనిసరి పనులపై ఎండలో బయటకు వెళ్లాల్సిన వారు నెత్తికి టోపి పెట్టుకోవడం, రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణకోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. వీలైనంత వరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి. దాహం వేయకపోయిన ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తరచూ తాగుతుండాలి.

ఎండల్లో ఎక్కువ సమయం ఉన్నప్పుడు శరీరంలోని నీటిశాతం తగ్గి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వడదెబ్బ తగిలినప్పుడు తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జర్వం కలిగియుండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి ఉంటుంది. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకుంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరినీరు గానీ తాగాలి. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించాలి. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి, ఫ్యాను వాడాలి, చల్లని నీటితో స్నానం చేయాలి. తక్కువ ఖర్చుతో కూడిన చల్లదనం కోసం ఇంటిపై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ను ఉపయోగించడం మంచిది. మేడపైన మొక్కలు, ఇంట్లోని మొక్కలు (ఇండోర్ ప్లాంట్స్) భవనాన్ని చల్లగా ఉంచుతాయి. అదేవిదంగా ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయి.

ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు చేయకూడనివి

ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. వేసవి కాలంలో నలుపురంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదు. మధ్యాహ్నం తరువాత (మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్యకాలంలో) బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్దులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు. వీరిపై ఎండ ప్రభావం త్వరగా చూపే అవకాశం ఉంది. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలను తీసుకోవద్దు. ప్రకాశించే లైట్ బల్బులను వాడటం మానుకోండి అవి అనవసరమైన వేడిని విడుదల చేస్తాయి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె వంటి తీపిపదార్థాలు తీసుకొనకూడదు. కూల్డ్రింక్స్, ఐస్క్రీములు వంటివి తీసుకుంటే అనారోగ్యం ఏర్పడుతుంది. ఎండ ఎక్కువగా వున్న సమయంలో వంట గది తలుపులు, కిటికీలను తీసివుంచి తగినంత గాలి వచ్చేవిధంగా చూసుకోండి. వడ దెబ్బకు గురైన వారిని వేడి నీటిలో ముంచిన గుడ్డతో తుడువరాదు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చుటలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదు.

క్రైం న్యూస్

ఎర్రచందనం కేసులో

పది మందికి జైలు శిక్ష

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధి ఎర్ర చందనం అక్రమ రవాణా కేసు లో 10 మంది నేరస్తులకు ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కరికి రూ.1000లు జరిమానాను విధిస్తూ పుత్తూరు అసిస్టెంట్ సెషన్ కోర్ట్ తీర్పు వెలువడినట్లు ఎస్ఆర్ఓ ఎస్ఐ సుమన్ గురువారం తెలిపారు. 2014లో ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో రిజిస్టర్ అయిన కేసులో నిందితులకు కోర్డు శిక్ష ఖరారు చేయగా, సదరు ముద్దాయిలు కోర్టు తీర్పును తిరుపతి స్పెషల్ కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. అప్పీల్ విచారణ సందర్భంగా కోర్టు కేసు దర్యాప్తును పరిశీలించి, పుత్తూరు అసిస్టెంట్ సెషన్ కోర్ట్ విధించిన శిక్షను తిరుపతి కోర్టు సైతం ఖరారు చేసింది. దీంతో పోలీస్ వారు, ఎస్కార్ట్ ద్వారా సదరు 10 ముద్దాయిలను చిత్తూరు జిల్లా జైకులు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసిన అప్పటి సిబ్బందిని ప్రస్తుతం సిబ్బందిని ఎస్పీ అభినందించారు. యువత అక్రమ వ్యాపారాలు చేయకుండా సన్మార్గంలో నడవాలని ఎస్ఐ సుమన్ సూచించారు.

కొండతిమ్మనపల్లిని సందర్శించిన ఎంపీడీవో

ప్రజాశక్తి- శాంతిపురం: చిన్నారిదొడ్డి గ్రామపంచాయతీ కొండ తిమ్మనపల్లి గ్రామంను గురువారం ఎంపీడీవో ఎపిఆర్.కుమార్ సందర్శించినారు. కొండతిమ్మనపల్లి ఎస్సి కాలనీవాసులు గత పది రోజులుగా నీటి సమస్యతో బాధపడుతున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికి నీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ కాలనీలో నిరుపయోగంగా ఉన్న బోరులో నీటి నిలువలను పరిశీలించి వెంటనే తెలుపవలసినదిగా పంచాయతీ కార్యదర్శి యం.సుమయాను ఆదేశించారు. సదరు బోరులో నీటి నిలువలు ఉన్నట్లయితే కొత్త మోటార్ ఏర్పాటు చేసి కాలనీ వాసులకు నేరుగా నీటి సరఫరా చేయబడుతుందని తెలిపారు. అనంతరం 2014లో మంజూరైన పక్కా గృహాలకు బిల్లులు రాక అసంపూర్తిగా ఉన్నాయని ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నివేదిక తయారు చేసి బిల్లులు పెండింగ్లో ఉన్న లబ్దిదారులకు బిల్లులు చెల్లించుటకు తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. కాలనీలో జెసిబి ద్వారా ముళ్ళపొదలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీవో తెలియజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్, హౌసింగ్ ఆర్.సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మురుగేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పులిచెర్లలో ఒంటరి ఏనుగు హల్చల్



ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ పేరావాళ్లపల్లి గ్రామంలోకి గురువారం మధ్యాహ్నం ఒంటరి ఏనుగు ప్రవేశించి హల్చల్ చేసింది. ఏనుగు ఘీం కారం చేస్తూ గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్తులందరూ కలిసి గట్టిగా కేకలు వేస్తూ ఏనుగును అడవిలోకి తరిమివేశారు.

IN THE COURT OF CIVIL JUDGE (SENIOR DIVISION) :: PUTTUR
I.A.No.576/2024
O.S. No.9/2001
BETWEEN:-
T.Syamala (died) and others
---Petitioners/Plaintiffs
AND:-
T.J.Devaprasad (died) and others
---Respondents/Defendants
NOTICE TO RESPONDENT No.7
R7. Paul Anil Kumar, S/o Late P.F.Khan, residing at D.No.28-865, Kannaiah Naidu Colony, Chittoor town and Dist. Andhra Pradesh State.
Please take notice that the above case is posted for your appearance on 17-04-2025 before the Civil Judge (Senior Division), Puttur at 10-30am. Failure to appear on the said date by you the matter will be decided on exparte.
//By Order//
Sri M.Mohan Raju, M.A., LL.B.
Advocate
Door No.8-204, Plot No.135, New Balaji Colony, Tirupathi.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE PUTTUR.
I.A.87/2025,
O.S.NO.59/2016
Between:
Vankatesan @ K.R.Mannappa Mudali.
...Petitioner/Plaintiff.
Vs.
And:
C.G.Shanmugam(died)
L.R.K.Kannemma and others.
Sorakayalu (R16).
A.N. Velayudham (R17).
...Respondents/Defendants.
NOTICE TO R16 AND R17 IN I.A.NO.87/2025 BY PUBLICATION
To
1. Sorakayalu, S/o Annamali Mudali.
2. A.N.Velayudham, S/o Adhinarayana swamy.
Nos. 1 and 2 are residing at Selvavinayakar Street, KVR Peta, Nagari Mandal, Chittoor District.
Ref: I.A.No.87/2025 in O.S.No.59/2016 on the file of Senior Civil Judge's Court, Puttur.
Sir/Madam,
Please take notice that the plaintiffs have filed IA.No.87/2025 in OS.No.59/2016 to implead you as defendants 16,17 in the suit and the same is posted to 04.04.2025 for your appearance on that day at 10.30 a.m., before this Hon'ble Court either in person or through lawyer. If you fail to appear on that day, the matter will be decided exparte and next steps will be passed in the suit.
This is the order of this Hon'ble Court.
K.CHANDRA SEKHARA REDDY
ADVOCATE FOR THE PETITIONERS/ PLANITIFFS.